క్లుప్తంగా

సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ముద్దూరు పంచాయతీ పరిధిలోని తమటాడ గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, పంచాయతీరాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. మండల పరిషత్, గడపగడపకూ మన ప్రభుత్వంతో పాటు,పంచాయతీ నిధులతో ఈ రోడ్లు నిర్మించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అని పరీక్షించారు.

దొంగలతో బెంబేలు

మెరకముడిదాం: మండలంలోని భీమవరం, సోమలింగాపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేయడంతో రెండు గ్రామాల ప్రజలతో పాటు మండలవాసులు బెంబేలెత్తి పోతున్నారు. భీమవరంలో రెండు, మూడు ఇళ్లలోకి దొంగలు వెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు అప్రమత్తమవ్వడంతో దొంగలు పరారయ్యారని గ్రామస్తులు చెబుతున్నారు. సోమ లింగాపురంలో కూడా శుక్రవారం రాత్రి దొంగలు గ్రామసచివాలయం వద్ద సంచరిస్తున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే దొంగలు పలాయనం చిత్తగించారు. బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి సోమలింగాపురం, భీమవరం గ్రామాల్లో పహారా కాశారు. ఈ రెండు గ్రామాల్లో దొంగలు పడ్డారనే సమాచారం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని గ్రామాల్లో రాత్రి వేళల్లో యువకులు గస్తీ కాస్తున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

వేపాడ: బడి ఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలని, దుకాణాల్లో వారిని పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ బాలభాస్కరరా వు, ఎంపీడీఓ నిశ్చల అన్నారు. వేపాడలోని పలు దుకాణాలను పోలీసులు, ఎమ్మార్సీ సిబ్బందితో కలిసి శనివారం సందర్శించారు. దుకాణాల్లో ఎవరైనా బడిఈడు పిల్లలు పనిచేస్తున్నారా అని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రు లు పనుల్లో పెట్టవద్దని, బడికి పంపించాలని సూచించారు. బడిబయట ఉన్న పిల్లల గుర్తింపు సర్వే అన్ని గ్రామాల్లో చేపడుతున్నామని ఎంఈఓ చెప్పారు.

జూనియర్ కళాశాల ప్రారంభం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రమణ

జామి: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను(ఉన్నత పాఠశాలలో) డిప్యూటీ డీఈఓ రమణ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి ఎంపీసీ గ్రూపులో 18 మంది విద్యార్థులు, సీఈసీ గ్రూపులో 32 మంది జాయిన్ అయ్యారని తెలిపారు. ఇంకా సీట్లు అందుబాటులో ఉన్నాయని, మండల విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ గంగరాజు, హెచ్ఎం అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీ టాపర్స్‌కు వీసీ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి

విజయనగరం అర్బన్: ఆంధ్రయూనివర్సిటీ పరిధిలో డిగ్రీ వార్షిక పరీక్ష–2024 ఫలితాల్లో బీబీఏ కోర్సులో టాపర్స్‌గా నిలిచిన సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులు కె.రమ్య, టి.ఊర్మిళాదేవిని వర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి అభినందించారు. విద్యార్థినులు శనివారం ఆయన్ను విశాఖపట్నంలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. వీసీని కలిసిన వారిలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవిమణి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్.వరూధిని, టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులు ఉన్నారు.


ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



జామి: కుమరాంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



గంట్యాడ: పెదవేమలి గ్రామంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



చీపురుపల్లి: ఆంజనేయపురంలోని మారుతీ హరిహరక్షేత్రంలో స్వామి వారికి పండ్లతో అలంకరణ



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎస్‌ఐ దామోదరరావు, కమిటీ సభ్యులు



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: కొండగుళ్లు ప్రాంగణంలో అన్నసమారాధన




బొండపల్లి: కొవ్వాడపేటలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలో పూజలందుకుంటున్న స్వామివారు

గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని పట్టణాలు, పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివా రం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ఆంజనేయస్వామి విగ్ర హాలను అర్చకులు వివిధ పుష్పాలు, తమల పాకులు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠించడంతో పాటు భజనలు చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం: పురిటిపెంటలో పూలమాలలతో స్వామి వారికి అలంకరణ



జామి: జామిలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



లక్కవరపుకోట: దాసుళ్లపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు



లక్కవరపుకోట: మల్లివీడులో పూజలు చేస్తున్న పురోహితుడు



గుర్ల: గుజ్జంగివలసలో భజనలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: పురిటిపెంటలోని అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లక్కవరపుకోట: తామరాపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: మంగళపాలెంలో తమలపాకుల అలంకరణలో స్వామివారు

కౌంట్ డౌన్ షురూ...

- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు మరో 48 గంటల్లో తెర
- ఏ నోట విన్నా ఓట్ల లెక్కింపు మాటే
- జోరుగా పందాలు
- జిల్లాలో 2019 ఫలితాలు పునరావృత మనే చర్చ
- గెలుపు ధీమాలో వైఎస్సార్‌సీపీ క్యాడర్

చీపురుపల్లి: ఎప్పుడా ఎప్పుడా అంటూ ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం ఆసన్నమైంది. కౌటింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ అయ్యింది. మే13న పోలింగ్ ముగిసినప్పటి నుంచి జూన్ 4 ఎప్పుడొస్తుందా అంటూ సర్వత్రా ఎదురు చూస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నుంచి క్యాడర్ వరకు నరాలు తెగిపోయేంత ఉత్కంఠలో ఉన్నారు. అంతే కాకుండా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కలిసి కూటమిగా ఏర్పడగా వైఎస్సార్ సీపీ ఒంటరి పోరాటంతో తలపడుతున్న ఈ ఎన్నికలు చరిత్రలో మిగిలిపోతాయని సాధారణ పౌరులు సైతం చర్చించుకుంటున్నారు. మొత్తం మీద జూన్ 4 సమీపించ డం, మరో 48గంటలు మాత్రమే మిగిలి ఉండడంతో నరాలు తెగిపోయే ఉత్కంఠకు తెరపడే సమయం ఆసన్నమయ్యింది. మే13న సాయంత్రం పోలింగ్ ముగిసిన సమయం నుంచే గెలుపు ఓటములపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న తరుణంలో ఫలితాలపై చర్చ మరింత విస్తృతమయ్యింది. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ ఏ ఇద్దరు కలిసినా, ఫోన్‌లో మాట్లాడుకున్నా ఎన్నికల ఫలితాల గురించి తప్ప మరో అంశం లేకపోవడం గమనార్హం. బంధువులు, కుటుంబ సభ్యులు సైతం ఫోన్‌లో మాట్లాడుకున్నా, ఏదైనా ఫంక్షన్‌లలో కలిసినా ఇదే చర్చ. ఎన్నికల్లో ఫలితాలపై పందాలు కూడా జోరుగా జరిగాయి. రాష్ట్రంలో ఏర్పడబోయే ప్రభుత్వం, పార్లమెంటు స్థానాలపై బెట్టింగ్‌లు వేసుకున్నారు. చీపురుపల్లి అసెంబ్లీ స్థానంపై మాత్రం బెట్టింగ్‌లకు టీడీపీ కూటమి నుంచి పెద్దగా ఎవరూ ముందుకు రాలేదనే చర్చ స్థానికంగా జరుగుతోంది. చీపురుపల్లి పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లు, గ్రామాల్లోని పలు పోలింగ్ బూత్‌ల్లో మెజార్టీల కోసం బెట్టింగ్‌లు వేసుకున్నట్లు తెలుస్తోంది.

2019 ఫలితాలు పునరావృతమనే చర్చ

విజయనగరం జిల్లాలో విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాలతో పాటు మన్యం పార్వతీపురం జిల్లాలో సాలూరు, పార్వతీపురం, కురుపాం , పాలకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. విజయనగరం జిల్లాలోని ఎస్.కోట నియోజకవర్గం విశాఖపట్నం పార్లమెంటు పరిధిలో ఉండగా మిగిలిన నియోజకవర్గాలన్నీ విజయనగరం పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. మన్యం పార్వతీపురం జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాలన్నీ అరకు పార్లమెంటు పరిధిలో ఉన్నాయి. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కూడా మళ్లీ అవే ఫలితాలు పునరావృతం కానున్నాయని పార్టీ క్యాడర్ ధీమాగా చెబుతోంది.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ రమేష్

గజపతినగరం: మహిళలు స్వయం ఉపాధి పొందేలా జనశిక్షణ సంస్థాన్ సంస్థ తోడ్పాటు అందిస్తోందని ఆ సంస్థ చైర్మన్ డి.రమేష్ తెలిపారు. జనశిక్షణ సంస్థ నిర్వహించిన బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో వందరోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మండల కేంద్రంలోని ఆల్తి వారి కల్యాణ మండపంలో శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గజపతినగరం , ఆంధ్ర, విజయ నగరం సెంటర్లలో మహిళలకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. శిక్షణ పొందిన వారంతా స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. జనశిక్షణ సంస్థాన్ సంస్థ డైరెక్టర్ వి.హరీష్, పీఓ కోటి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



జామి: వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జామి: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డీఎంహెచ్ఓ భాస్కరరావు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిలువలేకుండా చూసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. మలేరియా ప్రభావిత పీహెచ్‌సీలు కొట్టాం, పి.ఎం.పాలెం ,మెంటాడ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వై.మణి,జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి,ఎపిడిమాలజిస్ట్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్ఓ ఫ్లారెన్స్, హెచ్.వి.భవానీ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొత్తవలస: పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల దోమలను నిర్మూలించవచ్చని, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా వియ్యంపేటలో వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. వైద్య సిబ్బంది పద్మావతి, ఈశ్వరరావు, సత్యారావు పాల్గొన్నారు.

పని చేయించుకున్నారు.. వేతనం ఇవ్వరా..?



నిరసన తెలుపుతున్న రూట్ ఆఫీసర్లు

చీపురుపల్లి: సమయంతో సంబంధం లేకుండా ఎప్పుడు పిలిస్తే అప్పుడు, శని, ఆదివారాలు తేడా లేకుండా 14 రోజులు సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించామని, ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు అప్పగించినంత వరకు పని చేసిన తమకు ఒక్క రూపాయి కూడా వేతనం ఇవ్వలేదని రూట్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 మందిని రూట్ ఆఫీసర్లుగా నియమించారని,14రోజులపాటు తామంతా విధులు నిర్వర్తించామని చెప్పారు. వేతనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న నాథులే లేకుండా పోయారని వాపోయారు. ఈవీఎంలు సిద్ధం చే యడం నుంచి వాటిని పోలింగ్ కేంద్రాలకు చేర్చడం, పోలింగ్ తర్వాత ఈవీఎవలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినంత వరకు విధులు నిర్వర్తించినా తమకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అడుగుతున్నప్పటికీ స్పష్టమైన సమాచారం రావడం లేదని, అంతేకాకుండా రూట్ ఆఫీసర్లకు ఎలాంటి చెల్లింపులు ఉండవన్నట్లు కార్యాలయంలో సమాధానం ఇస్తుండడం బాధాకరమన్నారు.అలాంటప్పుడు తమతో ఎందుకు పనులు చేయించుకున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానికంగా ఉన్న ఎన్నికల అధికారులు చొ రవ చూపి న్యాయం చేయకపోతే జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

కార్మికులను బలిచేయొద్దు

- జిందాల్ కార్మికులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస:

ముడిసరుకు సమకూర్చుకునే బాధ్యత యాజమాన్యందేనని.. ముడిసరుకు లేదని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం ప్రతినిధులు లే ఆఫ్ ప్రకటించడం సరికాదని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మొండి వైఖరిని విడనాడి కార్మికులపై సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించామన్నారు. కర్మాగార మనుగడకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యాజమాన్యం శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కర్మాగార యాజమాన్య ప్రతినిధులు దినేష్‌శర్మ, గోపాలకృష్ణతో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, పప్పల బంగారునాయుడు, భీమయ్య, లగుడు వామాలు తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. ప్రస్తుతం కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల్లో 70 శాతం మంది 55 సంవత్సరాలకు పైబడిన వారే ఉన్నారని, వారిని ఇప్పుడు వేరే రాష్ట్రంలోని మరో యూనిట్‌లోకి పనికి వెళ్లమనడం సరికాదన్నారు. ఒకటి రెండు రోజుల్లో కార్మికులకు మేలుజరిగేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, కొత్తవలస, అప్పన్నపాలెం సర్పంచ్‌లు మచ్చ రామస్వామి, కోన దేముడు, వైఎస్సార్ సీపీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, సింగంపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.